# బలరాంపై వేటు



అసెంబ్లీ నుంచి బయటకు వస్తున్న కరణం బలరాం

**సభ నుంచి ఆరునెలలు వెలి ★ ఆఖరి నిమిషంలో ఆమోదం**

**రాష్ట్ర చరిత్రలో ఇదే ప్రథమం ★ విపక్షాల తీవ్ర నిరసన**

హైదరాబాద్ - న్యూస్‌టుడే

**రా**ష్ట్ర శాసనసభ చరిత్రలో తొలిసారి సంచలన ఘట్టం చోటు చేసుకుంది. తెలుగుదేశం శాసనసభ్యుడు కరణం బలరామకృష్ణమూర్తి (అద్దంకి) ఆరునెలలపాటు అసెంబ్లీ నుంచి సస్పెండయ్యారు. మంగళవారం మధ్యాహ్నం విపక్షాల నిరసనల మధ్య ఉపసభాపతి కుతూహలమ్మ సభలో ఈ నిర్ణయాన్ని ప్రకటించారు. విపక్షాలకు కనీసం నిరసన తెలిపే అవకాశం కూడా ఇవ్వకుండా సభను బుధవారం ఉదయానికి వాయిదావేశారు. గతంలో ఒంగోలులో జరిగిన ఓ కార్యక్రమంలో సభాపతి సురేశ్‌రెడ్డిపై బలరాం అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ చీఫ్ విప్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు శైలజానాథ్, విశ్వరూప్, వేదాస్ వెంకయ్య, వేదవ్యాస్, నాదెండ్ల మనోహర్, ఏరాసు ప్రతాపరెడ్డి సభాపతికి ఫిర్యాదు చేశారు. ఆయనీ విషయాన్ని శాసనసభ హక్కుల సంఘానికి నివేదించారు. గాదె వెంకటరెడ్డి నేతృత్వంలోని ఈ సంఘం నివేదికను మంగళవారం మధ్యాహ్నం సభలో ప్రవేశపెట్టింది. గాదె మాట్లాడుతూ తన వాదన వినిపించుకోవడానికి బలరాంకు అవకాశమిచ్చామని చెప్పారు. 'తాను సభాపతిపై ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదనీ, రోశయ్యనుద్దేశించి మాత్రమే కొన్ని వ్యాఖ్యలు చేసినట్లు ఆయన చెబుతూ వచ్చారు. సభాపతిపై ఆయన వ్యాఖ్యలు సభాహక్కుల ఉల్లంఘన కిందకు వస్తాయని సంఘం ఏకగ్రీవంగా నిర్ణయించింది. ఏ నిర్ణయం తీసుకోవాలనేది సభకు వదిలేస్తున్నాం' అని తెలిపారు.

**సభాపతిని నేనేమీ అనలేదు.. బలరాం:** అనంతరం బలరాం మాట్లాడుతూ.. శాసనసభలో వరద సహాయంపై జరిగిన చర్చను మంత్రి రోశయ్య వక్రమార్గం పట్టించారనే ఉద్దేశంతో ఆయననుద్దేశించి మాత్రమే తాను వ్యాఖ్యలు చేశానన్నారు. సభాపతితో తనకు సాన్నిహిత్యం ఉందనీ, ఆయననుద్దేశించి ఎలాంటి మాటలు అనలేదని స్పష్టంచేశారు. తాను మంత్రిని దృష్టిలో పెట్టుకుని మాత్రమే అసలు దొంగలు ఎవరో చెప్పాలని మాట్లాడినట్లు పేర్కొన్నారు. అవినీతిని బయటపెడతామనే భయంతో డీడీఆర్‌సీలో కూడా మాట్లాడనివ్వడం లేదన్నారు. డీడీఆర్‌సీలోకి తాగొచ్చి గొడవ చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ దశలో సీఎం కల్పించుకుని 'డీడీఆర్‌సీలో తాగొచ్చి గొడవ చేస్తున్నారా? ఆ మాటే మీరిప్పుడు అన్నారా' అని ప్రశ్నించారు. బలరాం దాటవేసేందుకు ప్రయత్నించగా స్పష్టంచేయాలని వైఎస్ పట్టుబట్టారు. 'సీఎం అతితెలివి చూపిస్తున్నారు. అవును! తాగి వచ్చిన వారి గురించి మాట్లాడాను. మీ మంత్రులే సాక్ష్యం' అని బలరాం పేర్కొనడంతో కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారు. ప్రతిగా తెదేపా సభ్యులు స్పందించడంతో గందరగోళం ఏర్పడింది. బలరాం కొనసాగిస్తూ.. 'నేను అననిదాన్ని ఆపాదించడం సమంజసం కాదు. తప్పులుంటే పరిశీలించండి' అని నిరసన వ్యక్తంచేశారు. చివరి నిమిషంలో వ్యూహాత్మకంగా వ్యవహరించిన అధికారపక్షం.. సీపీఎం నేత నోములకు మాట్లాడే అవకాశమివ్వలేదు. చర్చకు అనుమతించవద్దని చీఫ్‌విప్ సూచించారు. వెంటనే కుతూహలమ్మ.. చర్యకు సిఫార్సు చేయాలని గాదెను కోరారు. చర్చించాల్సిందేనని విపక్ష సభ్యులు పట్టుబట్టారు. తెదేపా సభ్యులు పోడియం వద్దకు దూసుకెళ్లారు. బలరాంను సస్పెండ్ చేయాలని సంఘం చేసిన సిఫార్సును ఆమోదిస్తున్నట్లు కుతూహలమ్మ ప్రకటించారు. సభాహక్కులు ఉల్లంఘించారంటూ ఒక ఎమ్మెల్యేని 6నెలల పాటు సస్పెండ్ చేయడం రాష్ట్ర శాసనసభ చరిత్రలోనే మొదటిది. ఫిబ్రవరి 26 వరకూ బలరాంపై సస్పెన్షన్ కొనసాగుతుంది. ఆ తర్వాత సభ జరిగితేనే ఆయన సభలోకి వస్తారు.